నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 5-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:106 పేజీలు:4 వెల: రూ.1/-

గ్రేటర్ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు తగ్గిన సీట్లు

70 సీట్లకు మాత్రమే పరిమితం కానున్న మెజార్టీ
వందసీట్లు సాధిస్తామన్న ఆశలకు గండికొట్టిన బిజెపి
4నుంచి 36 సీట్లకు దూసుకొచ్చిన కమలం
సత్తాను చాటుకుని స్థానాలు నిలుపుకున్న ఎంఐఎం
మూడు సీట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ
మేయర్ అభ్యర్థిగా భారతీనగర్ కార్పోరేటర్ సింధుకు ఛాన్స్?

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): జీఎచ్ఎంసీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది.అయితే తాజా ఫలితాలను పరిశీలిస్తే అధికార టిఆర్ఎస్ 70స్థానాల్లో విజయం సాధించేలా ఉంది. దీంతో మేయర్ పీఠాన్ని నిలబెల్లుకునేలా ఉంది. వంద సీట్లు సాధిస్తామని ప్రకటించినా గతంలో 99కి బదులు 70 సీట్లకే పరిమితం అయ్యే పరిస్థితితులు ఉన్నాయి. ఇకపోతే టిఆర్ఎస్ దూకుడును బిజెపి గట్టిగానే ఎదుర్కొంది. ఆ పార్టీ గత ఎన్నికల్లో నాలుగు సీట్లకే పరిమితంకాగా ప్రస్తుతం 36 సీట్లను గెలుచుకునే దిశగా సాగుతోంది. వరద బాధిత ప్రాంతాల్లో, ఐటి కారిడార్‌లో బిజెపి పట్టు సాధించింది. ఇకపోతే ఎఐఎం తన పట్టును నిలుపుకుంది. ఇకపోతే మేయర్ అభ్యర్థిగా సింధూ ఆదర్శరెడ్డిని ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమె భరత్ నగర్‌నుంచి గెలుపొందారు. అయితే దీనిపై ఇంకా అధికారిక సమాచారం రావాల్సి ఉంది. గ్రేటర్‌లో టిఆర్ఎస్‌కు 36 ఎక్స్ అఫీషియో ఓట్లు ఉండడంతో టిఆర్ఎస్ గెలుపు సునాయాసం కానుంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో బీజేపీ అగ్రస్థానంలో ఉండగా.. టీఆర్ఎస్ పార్టీ రెండో స్థానంలో నిలిచింది. మెహదీపట్నం డివిజన్ ఫలితం మొదటిగా వెలువడంతో ఎంఐఎం విజయం సాధించింది. పలు డివిజన్లలో ఆధిక్యం కొనసాగిస్తున్న టీఆర్ఎస్ మెట్టుగూడలో తొలి విజయం నమోదు చేసుకుంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు పక్రియ కొనసాగుతోంది. తుది ఫలితాలు వెలువడే సరికి అధికార టిఆర్ఎస్ 70 స్థానాలకు చేరువలో ఉంది. బిజెపి 38 స్థానాలకే పరిమితం కానుంది. ఇకపోతే రెండు స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ మరో స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఎంఐఎం మాత్రం తన స్థానాలను నిలపుకునేలా 38 స్థానాల్లో ఆధిక్యం సాధించింది. ఇకపోతే వనస్థలిపురం డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి రాగుల వెంకట్ రెడ్డి

గెలుపొందారు. నాచారం డివిజన్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి శాంతి సాయిజన్, జగద్గిరిగుట్ట డివిజన్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి జగన్ విజయం సాధించారు. హబ్సిగూడలో బీజేపీ అభ్యర్థి కే. చేతన గెలుపొందారు. కూకట్‌పల్లి సర్కిల్‌ను టీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేసింది. ఆరుకు ఆరు డివిజన్లను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. 119 డివిజన్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో టీఆర్ఎస్ అభ్యర్థి ముద్దం నర్సింహా యాదవ్ గెలుపొందారు. 120 డివిజన్ బాలానగర్‌లో ఆవుల రవీందర్ రెడ్డి 3748 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 121 డివిజన్ కూకట్‌పల్లిలో జూపల్లి సత్యనారాయణ 749 ఓట్లతో, 122వ డివిజన్ వివేకానంద నగర్‌లో మాధవరం రోజా రంగారావు, 123వ డివిజన్ హైదర్ నగర్‌లో నార్నె శ్రీనివాస్ రావు 2010 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇక 124వ డివిజన్ ఆల్విన్ కాలనీలో దొడ్ల వెంకటేష్ గౌడ్ 1208 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

మేయర్ సతీమణి విజయం

గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి బొంతు శ్రీదేవీ గెలుపొందారు. చర్లపల్లి డివిజన్ నుంచి టీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగిన ఆమె విజయం సాధించారు. ఇక 8వ డివిజన్ హబ్సిగూడ నుంచి పోటీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సతీమణి స్వప్నపై బిజెపి అభ్యర్థి చేతన గెలుపొందారు.

కూకట్‌పల్లి జోన్‌లో ఇరవై డివిజన్లలో టీఆర్ఎస్ ఆధిక్యం కొనసాగుతుంది. 22 డివిజన్లకు 19 డివిజన్లలో టీఆర్ఎస్ ఆధిక్యంలో ఉంది. కూకట్‌పల్లి జోన్‌లో మూడు చోట్ల బీజేపీ ఆధిక్యం కొనసాగుతుంది. సోమాజిగూడ,చందానగర్, నేరేడ్‌మెట్‌లో టీఆర్ఎస్ ఆధిక్యం కొనసాగుతుంది. పటాన్‌చెరు, కాప్రా డివిజన్లలో టీఆర్ఎస్ విజయం సాధించింది. పటాన్‌చెరులో కుమార్ యాదవ్, కాప్రాలో స్వర్ణరాజ్ విజయం సాధించారు.

ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ రెండు డివిజన్లను గెలుచుకుంది. ఏఎస్ రావు నగర్, ఉప్పల్‌ను హస్తగతం చేసుకుంది. ఏఎస్ రావు నగర్‌లో సింగిరెడ్డి శిరీషా రెడ్డి, ఉప్పల్‌లో మందముల్లా రజిత విజయం సాధించారు. చింతల్ డివిజన్‌లో ఆ పార్టీ విజయం సాధించింది. టీఆర్ఎస్ అభ్యర్థి రషీదా బేగం గెలుపొందారు. అమీర్‌పేట్‌లో 960 ఓట్ల ఆధిక్యంలో బీజేపీ కొనసాగుతుంది. మాదాపూర్‌లో 4,999 ఓట్ల ఆధిక్యంలో టీఆర్ఎస్, మియాపూర్‌లో 1935 ఓట్ల ఆధిక్యంలో టీఆర్ఎస్ కొనసాగుతుంది. రాజేంద్రనగర్‌లో 1614 ఓట్లతో బీజేపీ ఆధిక్యంలో కొనసాగుతుంది. గచ్చిబౌలిలో 1000 ఓట్ల ఆధిక్యంలో బీజేపీ కొనసాగుతుంది. మల్లాపూర్‌లో 1,841 ఓట్లు, బాలాజీనగర్‌లో 7,501 ఓట్లతో టీఆర్ఎస్ ఆధిక్యంలో కొనసాగుతుంది. సనత్‌నగర్ డివిజన్‌లో టీఆర్ఎస్ విజయం సాధించింది. టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొలను లక్ష్మి రెడ్డి దాదాపు 2429 ఓట్ల మెజారిటీ విజయం సాధించారు. పాతబస్తీలో ఎంఐఎం పార్టీ తన హవా కొనసాగిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి జాకిర్ బక్రీ గెలుపు దత్తాత్రేయ నగర్ డివిజన్‌లో విజయం సాధించారు.

సంగారెడ్డి జిల్లా భారతినగర్ డివిజన్‌లో టీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి సింధు ఆదర్శ్ రెడ్డి సుమారు 3900 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కుత్బుల్లాపూర్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి పారిజాతం సుమారు 2025 ఓట్లతో మెజారిటీతో గెలుపొందారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయ్‌శేఖర్ గౌడ్ విజయం సాధించారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో అధికార టీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. కూకట్‌పల్లి పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి.. వివేకానందనగర్ కాలనీ, హైదర్‌నగర్, అల్విన్ కాలనీలో కారుపార్టీ పూర్తి ఆధిక్యంలో కొనసాగుతోంది. బాలానగర్ డివిజన్‌లో టీఆర్ఎస్ పార్టీ గెలపొందింది. టీఆర్ఎస్ అభ్యర్థి ఆవుల రవీందర్‌రెడ్డి విజయం సాధించారు. పలు డివిజన్లలో ఆధిక్యంలో ఉన్న బీజేపీ చైతన్యపురిలో గెలుపొందింది. బీజేపీ అభ్యర్థి నర్సింహ గుప్తా విజయం సాధించారు.

ఎంఐఎం మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. నవాబ్ సాహెబ్ కుంట డివిజన్‌లో ఎంఐఎం అభ్యర్థి

షిరీన్ ఖాతూన్ గెలుపొందారు. ఇప్పటి వరకు ఏడు డివిజన్లలో విజయం సాధించింది. ఎంఐఎం పార్టీ రియాసత్ నగర్ డివిజన్‌లో గెలుపొందింది. ఆ పార్టీ అభ్యర్థి ముస్తఫా బేగ్ విజయం సాధించారు. బార్కాస్‌లో ఎంఐఎం విజయం సాధిందిచి మరో డివిజన్‌ను తన ఖాతాలో వేసుకుంది. బార్కాస్‌లో ఎంఐఎం అభ్యర్థి షబానా బేగం విజయం సాధించారు. అహ్మద్‌నగర్‌లో ఎంఐఎం అభ్యర్థి రఫత్ సుల్తానా గెలుపొందారు. దీంతో ఇప్పటి వరకు ఎంఐఎం నాలుగు డివిజన్లను గెలుచుకొని ముందంజలో ఉంది. చాంద్రాయణగుట్టలో 10వేల ఓట్ల ఆధిక్యంలో ఎంఐఎం కొనసాగుతోంది. కిషన్‌బాగ్‌లో ఎంఐఎం విజయ సాధించింది. దీంతో ఎంఐఎం చెందిన మూడో గెలుపొందారు. ఈ డివిజన్‌లో ఎంఐఎం అభ్యర్థి హుస్సేనీ పాషా విజయం సాధించారు.డబీర్‌పురా డివిజన్‌లో ఎంఐఎం రెండో విజయం నమోదు చేసుకుంది. ఈ డివిజన్‌లో ఎంఐఎం అభ్యర్థి అలందార్ హుస్సేన్ గెలుపొందారు. అర్సీపురంలో టీఆర్ఎస్ అభ్యర్థి పుష్ప నగేష్‌యాదవ్ గెలుపొందారు. బోరబండలో టీఆర్ఎస్ పార్టీ గెలుపొందింది. డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ విజయం సాధించారు.మంగళ్‌హాట్ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి శశికళ గెలుపొందారు. హైదర్‌నగర్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి నార్నె శ్రీనివాసరావు విజయం సాధించారు. దీంతో టీఆర్ఎస్ పార్టీ ఖాతాలో మూడు డివిజన్లు చేరాయి. మెట్టుగూడలో టీఆర్ఎస్ అభ్యర్థి రాసూరి సునీత విజయం సాధించారు.

జాంబాగ్ డివిజన్ ఓట్ల లెక్కింపుపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ డివిజన్‌లోని బూత్ నంబర్ 8లో పోలైన ఓట్లు 471 కాగా, బ్యాలెట్ బాక్సులో 257 ఓట్లు మాత్రమే ఉన్నాయని ఆరోపిస్తోంది. హయత్‌నగర్ కౌంటింగ్ సెంటర్ వద్ద గందరగోళం చోటు చేసుకుంది. బీజేపీ, టీఆర్ఎస్ ఏజెంట్ల మధ్య ఘర్షణ జరిగింది. ఇప్పటికే బీజేపీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యం ప్రదర్శించగా, టీఆర్ఎస్ రెండో స్థానంలో ఉంది.

ఎన్నికల కమిషనర్ తక్షణం రాజీనామా చేయాలి

హైకోర్టు తీర్పుతో ప్రభుత్వం కళ్లు తెరవాలి: బండి

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఓటర్ల విశ్వాసాన్ని నిలబెట్టిన కోర్టుకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ గ్రేటర్ ఎన్నికలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎప్పటిలాగానే రాష్ట్ర ప్రభుత్వానికి మరో మొట్టికాయ వేసిందని.. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలని హెచ్చరించారు. ఎన్నిసార్లు కోర్టు మొట్టియాలు వేసిన దున్నపోతుమీద వాన పడ్డట్టుగానే పరిస్థితి ఉందని.. ఇసి, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవాలని చేసిన ప్రయత్నాన్ని హైకోర్టు అడ్డుకుందన్నారు. గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన మొదటి నైతిక విజయం ఇది అని.. అడ్డదారుల్లో గెలవాలని చూసిన టిఆర్ఎస్ పార్టీ కి ఇది చెంపపెట్టు అన్నారు. ఎలక్షన్ కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలని...లేదా ప్రభుత్వమే బర్తరఫ్ చేయాలని.. లేకపోతే ప్రజలే ఈ కెసిఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తారని హెచ్చరించారు. ప్రజా తీర్పును గౌరవించలేని వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదని.... టిఆర్ఎస్, ఈసీ ఎంత అనైతికంగా వ్యవహరించారో హైకోర్టు సాక్షిగా బట్టబయలు అయిందని మండిపడ్డారు. ప్రతీ గంటకు పోలింగ్ శాతం ప్రకటించిన ఈ.సి... సాయంత్రం 5 నుంచి 6 వరకు జరిగిన పోలింగ్ శాతాన్ని ఎందుకు అప్పటికప్పుడే ప్రకటించలేదని ప్రశ్నించారు. 5 నుండి 6 గంటల వరకు 12 శాతం నుండి 18 శాతం ఎలా పెరిగింది ? ...దీనిపై హైకోర్టు విచారణ జరపాలన్నారు. ఇంత దుర్మార్గంగా ఎప్పుడూ, ఎక్కడా ఎన్నికలు జరగలేదని.... పెన్నుతో టిక్కులు పెట్టిన లెక్కపెట్టుర్రి అని సర్క్యులర్ విడుదల చేయడం చూస్తుంటే అధికారం పోతదేమో అన్న ఆకలి, ఆపతి, ఆతృత కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికుట్రలు చేసిన బీజేపీ వైపే ప్రజలు ఉన్నారని ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్రలే సాక్షాలు అని తెలిపారు.

కోటిమంది ఆరోగ్య కార్యకర్తలకు తొలి వ్యాక్సిన్

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాక్సిన్‌ను మొదటగా దేశంలోని కోటి మంది ఆరోగ్య కార్యకర్తలకు ఇవ్వనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. శుక్రవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీలకు ప్రభుత్వం సమాచారం ఇచ్చింది. ఆరోగ్య కార్యకర్తల తర్వాత కరోనాపై పోరాటం చేస్తున్న పోలీసులు, మున్సిపల్ వర్కర్లు వంటి 2 కోట్ల మంది ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఇవ్వనున్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆల్ పార్టీ మీటింగ్‌లో ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్‌లో ఉన్న డాక్టర్లు, నర్స్‌లకు మొదట వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఈ ప్రెజెంటేషన్‌లో భాగంగా రాజేష్ భూషణ్ వెల్లడించినట్లు తెలిపింది.

ఆకాశ్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): భారత్, చైనా మధ్య సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తాజాగా ఆకాశ్ క్షిపణి పరీక్షలు నిర్వహించింది. ఆధునీకరించిన 10 ఆకాశ్ క్షిపణులను ఆంధ్రప్రదేశ్‌లోని సూర్యలంక టెస్ట్ ఫైరింగ్ రేంజ్ నుంచి విజయవంతంగా పరీక్షించింది. ఒకవేళ శత్రుసేనల యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశిస్తే కూల్చివేయడానికి ఈ ఆకాశ్ క్షిపణులు తోడ్పడుతాయని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తెలిపింది.దాదాపు 10 ఆకాశ్ క్షిపణులను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పరీక్షించిందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. శత్రు దేశ విమానాలు దాడికి వస్తే వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో ఆకాశ్ క్షిపణుల సాయంతో ఆ దాడులను తిప్పికొట్టడం ఎలా అనే దానిపై ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది ప్రాక్టీస్ చేశారని వెల్లడించింది. సరిహద్దు వివాదం నేపథ్యంలో ఇండియన్ ఆర్మీ ఇప్పటికే భారీ స్థాయిలో ఆకాశ్ క్షిపణులను ఈస్టర్న్ లఢఖ్ ప్రాంతాల్లో మోహరించింది

హైదరాబాద్ మార్కెట్‌కు భారీగా టమాటాల దిగుమతి

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): గత కొన్ని రోజులుగా సామాన్య ప్రజలకు చెమటపుట్టించిన టమాటా ధరలు దిగి వస్తున్నాయి. జంటనగరాల్లోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్‌లకు భారీగా టమాటా దిగుమతి అవుతోంది. హైదరాబాద్ మార్కెట్‌కు తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక నుంచి కూడా టమాటా దిగుమతి అవుతోంది. గత నెల రోజుల క్రితం కిలో టమాటా 50 నుంచి 60 రూపాయలు పలికింది. మార్కెట్‌కు దిగుమతు తగ్గడం వల్లనే ధరలు పెరిగినట్టు

మెల్లగా దిగివస్తున్న ధరలు

వ్యాపారులు తెలిపారు. అంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాల వల్ల కూడా టమాటా పంట దెబ్బతినడంతో వల్ల దిగుమతులు బాగా తగ్గిపోయాయి. కానీ ప్రస్తుతం మార్కెట్‌కు భారీగా టమాటా దిగుమతి పెరిగింది. రోజుకు 80 నుంచి 100 లారీల టమాట హైదరాబాద్‌కు దిగుమతి అవుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. దీంతో ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లలో కిలో టమాటా 15 నుంచి 25 రూపాయల మధ్య అమ్ముతున్నారు. దీంతో సామాన్య ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించే ప్రతిసారీ నిత్యావసర వస్తువులపై ప్రభావం చూపిస్తుంది. ప్రత్యేకించి సామాన్య ప్రజలు నిత్యం వాడే టమాటా ధర పెరిగిన ప్రతిసారీ దాని ప్రభావం ఇతర వస్తువులపై కూడా చూపిస్తోంది.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మెదక్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి సముచిత స్థానం కల్పిస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని ఎంపీపీ అతిథి గృహంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కల్యాణలక్ష్మి పథకం దేశానికే ఆదర్శమన్నారు.

దేశంలో ఎవరు చేయని విధంగా రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. బీసీలకు కూడా త్వరలోనే అర్హులైన వారందరికీ సబ్సిడీ రుణాలను అందజేస్తామన్నారు.

త్వరగా ఫ్లై ఓవర్ పనుల పూర్తి: మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి,డిసెంబర్4 (ఆర్ఎన్ఎ): రెండు సంవత్సరాల క్రితం ఆగిపోయిన ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ సమయంలో స్థలాలు నష్టపోయిన బాధితులకు సరైన న్యాయం జరుగక పోవడంతో కొంత మంది కోర్టుకు వెళ్లడంతో ఈ పనులు నిలిచిపోయాయని అన్నారు.

ప్రస్తుతం బాధితులకు స్థలంతో పాటు, కొంత మొత్తాన్ని కూడా ప్రభుత్వం అందజేస్తుందని, దీనికి బాధితులు అంగీకారం తెలుపడంతో నిర్మాణ పనులు ఆటంకాలు లేకుండా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తయితే కొండాపూర్, కీసర, శామీర్‌పేట్, మేడ్చల్ వరకు వెళ్లే వాహన దారులకు సౌకర్యంగా ఉంటుందని మంత్రి తెలిపారు.

లంచం కేసులో బిజెపి కౌన్సిలర్ అరెస్ట్

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): లంచం కేసులో బీజేపీకి చెందిన కౌన్సిలర్ మనోజ్ మెహ్లావత్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. న్యూ ఢిల్లీలోని వసంత కుంజ్ నుంచి మనోజ్ మెహ్లావత్ కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ విషయాన్ని సీబీఐ ధ్రువీకరించింది. నిర్మాణ పనులకు సంబంధించి మనోజ్ మెహ్లావత్ ఒక వ్యక్తి నుంచి రూ.10 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం అందుకున్న తరువాత.. సీబీఐ అధికారులు ఆయనను పట్టుకునేందుకు పకడ్బంధీ పథకం రచించి విజయం సాధించారు. మనోజ్ మెహ్లావత్‌ను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకుని అరెస్టు చేసి.. కస్టడీ కోసం కోర్టులో హాజరుపరిచారు. భారతీయ జనతా పార్టీ టికెట్‌పై 2017 మునిసిపల్ ఎన్నికల్లో మనోజ్ మెహ్లావత్ వసంత కుంజ్ నుంచి ఎన్నికయ్యారు. వసంత కుంజ్‌లోని అతడి ఇంటి నుంచే అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. అవినీతికి వ్యతిరేకంగా, గత కొన్ని నెలలుగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చట్ట అమలు సంస్థ.. పలువురు ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసింది.

జిల్లాల్లో మళ్లీ కరోనా భయాలు

ఇటీవలి గ్రేటర్ ఎన్నికల్లో పాల్గొన్న వారిలో టెన్షన్

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): కరోనా మరోసారి విజృంభించే లక్షణాలు రోజురోజుకు స్పష్టమవు తున్నాయి. ఇటీవల ప్రజలు విచ్చలవిడిగా బయటకు రావడం, మాస్కులు ఉన్నా లేకున్నా ముందుకు సాగడం ప్రమాదం ముప్పును సూచిస్తోంది. ఒకవైపు చలితీవ్రత ఎక్కువవుతుండడం, మరోవైపు పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుండడంతో కరోనా విస్తరించే ప్రమాదం పెరిగిపోతున్నది. పెళ్లిళ్లలో నిబంధనలకు మించి వందలాది మంది హాజరవుతుండడం, పట్టణ ప్రాంతాల్లో మాస్కులు లేకుండా, కనీస భౌతిక దూరం పాటించకుండా తిరుగుతుండడంతో రోజురోజుకు కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో జిల్లాల నుంచి వేలాదిమంది రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని రావడం కరోనావ్యాప్తికి కారణమయ్యే అవకాశమున్నది. అలాగే ప్రధానంగా జిల్లా కేంద్రాల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా పొంచి ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో వైరస్ గణనీయంగా తగ్గుముఖం పడుతున్నా జిల్లా కేంద్రానికి, దానిని ఆనుకొని ఉన్న మండల కేంద్రాల్లో వ్యాధి సోకుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. వారం రోజులుగా కరీంనగర్‌లో కరోనా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతూ పోతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కేసులు నమోదవుతున్నా టెస్టులు వెళ్లకపోవడంతో బయటపడడం లేదు. పట్టణ ప్రాంతాల్లో సీటీస్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయించుకొని మందులు వాడుతున్నవారి సంఖ్యే ఎక్కువగా ఉన్నది. దీంతో పాజిటివ్ వస్తున్న కేసుల సంఖ్య ప్రభుత్వం చెబుతున్నదానికంటే రెండువంతులు ఎక్కువ ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.. ఇటీవలి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జిల్లాకు చెందిన టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పార్టీల నేతలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. జిల్లాలకు చెందిన నేతలే అన్ని పార్టీల్లో క్రియాశీల పదవుల్లో ఉండడంతో ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున ఆయా పార్టీల నేతలు తరలివెళ్లి ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిధిలోని మంత్రులు స్టార్ క్యాంపెయినర్లుగా ఉండగా మరికొందరు ఏరియా బాధ్యతల్లో ఉన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకర్గం నుంచి అన్ని పార్టీల నుంచి 200 నుంచి 250 మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులందరు పార్టీ ప్రచారానికి హైదరాబాద్‌కు వెళ్లారు. వీరందరు అక్కడ ప్రచారం నిర్వహించి రావడంతో వీరందరు క్వారంటైన్‌లో ఉండాలని వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలంతా వారం రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలని ప్రజారోగ్యశాఖ

సంచాలకులు శ్రీనివాస్‌రావు విజ్ఞప్తి చేశారు. వీరందరికి కరోనా వ్యాధి లక్షణాలు ఉన్నా లేకున్నా ఏడు రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలని, అనుమానం ఉన్నవారు వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. రాజకీయ నాయకులెవరు ఆ సూచనలను పట్టించుకున్న పరిస్థితి కనిపించడం లేదు. ప్రచారానికి వెళ్లివచ్చిన నాయకులంతా యథావిధిగా తమ కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరిలో కలిసి తిరుగుతున్నారు. వీరిలో ఎవరికైనా కరోనా వచ్చి ఉంటే వారి ద్వారా కూడా ఇతరులకు వ్యాపించే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

1నుంచి మూడుస్థానాలకు ఎదిగిన కాంగ్రెస్

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు రెండు డివిజన్లలో విజయం సాధించింది. ఏఎస్ రావు నగర్, ఉప్పల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. అయితే వీరిద్దరూ మహిళా అభ్యర్థులే కావడం విశేషం. ఏఎస్ రావు నగర్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన సింగిరెడ్డి శిరీషా రెడ్డి, ఉప్పల్ (10వ డివిజన్) నుంచి మందముల్లా రజిత 5912 ఓట్లతో గెలుపొందారు. కాగా గ్రేటర్ ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీని హైదరాబాద్ ఓటర్లు మరోసారి తిరస్కరించారనే చెప్పవచ్చు. ఇప్పటి వరకూ వెల్లడైన ఫలితాల ప్రకారం.. హస్తం పార్టీ కనీసం ప్రభావం చూపలేకపోయింది. ఇక దుబ్బాక విజయంతో ఒక్కసారే రేసులోకి వచ్చిన బీజేపీ.. కాంగ్రెస్ ఓట్లకు భారీగా గండికొట్టినట్లు కనిపిస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కాషాయదళం భారీగా ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది.

హైదర్‌నగర్‌లో నార్నె శ్రీనివాస్ విజయం

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): నగరంలోని హైదర్ నగర్ డివిజన్‌లో టీఆర్ఎస్ అభ్యర్థి నార్నే శ్రీనివాస్ ఘన విజయం సాధించారు. 2010 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. దీంతో టీఆర్ఎస్ కార్యకర్తలు గెలుపు సంబరాల్లో మునిగితేలారు. ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన .. తన విజయానందాన్ని పంచుకున్నారు. తనపై నమ్మకం పెట్టి గెలిపించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రచారంలో తన దృష్టికి వచ్చిన సమ

వ్యవసాయ చట్టాలపై సమీక్ష జరగాలి

నేటినిజం
శనివారం 5-12-2020

ఢిల్లీలో వారం రోజులుగా ఆందోళన చేస్తున్న రైతులతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు కొలిక్కి రాలేదు. కేంద్రం ఇటీవల తీసుకుని వచ్చిన వ్యయసాయ చట్టాల్లో అనేక అనుమానాలు ఉన్నాయని రైతులు, రైతు సంఘాల నేతలు వాదిస్తున్నారు. నిజంగా ఈ చట్టాలు సరైనవే అయితే ప్రభుత్వ దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించాలి. రైతులకు మేలుచేసేవే అయితే చెప్పాలి. రైతుల ఆందోళనలను విపక్షాల కుట్రగా గాకుండా..రైతుల కోణంలో చూడాలి. ఢిల్లీలో చల్లటి చలిలో వీరంతా ఎందుకు ఆందోళన చేస్తున్నారో ఆరా తీయాలి. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు అన్నీ జాతి వ్యతిరేకమైనవనే భావన సరికాదు. అయితే ఈ ఆందోళనలో రాజకీయ కోణం లేదనడానికి లేదు. కేవలం కొందరు రైతులు మాత్రమే రావడం, అదికూడా పంజాబ్, హర్యానాలకు మాత్రమే పరిమితం కావడాన్ని గుర్తించాలి. దేశవ్యాప్తంగా మరెక్కడా ఇలాంటి ఆందోళనలు లేవు. ఇది కూడా గమనించాల్సిన విషయం. అయితే రైతులకు నష్టం జరిగే పక్షంలో ప్రభుత్వం సరిదిద్దుకునే ప్రయత్నం చేయడంలో తప్పులేదు. కొత్త చట్టాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకురావడమే కారణమని అంటున్నారు. పంజాబ్ రైతులు దశాబ్దాలుగా తాము పండించే వరి, గోధుమ ధాన్యాల విక్రయాలపై అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. కొత్త సాగు చట్టాలు ఆ సువ్యవస్థిత పద్ధతిని విచ్ఛిన్నం చేస్తాయని, తమ భవిష్యత్తు అనిశ్చితమని ఆ రైతులు విశ్వసిస్తున్నారు. ఈ కారణంగానే వారు ఢిల్లీకి తరలివచ్చారు. మొత్తంగా సమస్య ఏదైనా..ఎవరు చేసినా సమీక్షించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. మనరైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయభూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. సస్య విప్లవానికి నాంది పలకాలి. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్డిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉంటున్నారు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది

ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. కొత్తగా తీసుకుని వచ్చిన వ్యవసాయ చట్టాల్లో ఈ అంశాలను చేర్చి చర్చించాలి. సమగ్ర వ్యవసాయ చట్టాలను తీసుకుని వచ్చి అన్నం పెడుతున్న అన్నదాతలను అక్కున చేర్చుకోవాలి. తాజాగా రైతుల ఆందోళనల నేపథ్యంలో బిజెపి మరోమారు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది.

ఫ్రంట్ వారియర్స్ వివరాల సేకరణ

రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో వ్యాక్సిన్ కోసం జాబితా సిద్ధం

కరీంనగర్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం వ్యాక్సిన్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, రెండు ప్రైవేట్ కళాశాలల ఆస్పత్రులు, 253 ప్రైవేట్ ఆస్పత్రుల్లో అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది మినహా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, హౌస్ కీపింగ్, తదితర విభాగాల్లో పనిచేసే వారు ఎందరున్నారనే వివరాలను సేకరించారు. దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడు వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినా ప్రజలకు ఇచ్చేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. బ్రిటన్‌లో వచ్చే వారం నుంచి ఫైజర్ వ్యాక్సిన్‌ను ఇచ్చేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతించడం, ఆ వ్యాక్సిన్ ప్రయోగాలు ఇక్కడ కూడా తుది దశలో ఉండడంతోపాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ నగరంలోని భారత్ బయోటెక్‌లో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్న కోవ్యాగ్జిన్ గురించి తెలుసుకొని వెళ్లడంతో త్వరలోనే వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. డిసెంబర్ చివరినాటికి కోవ్యాగ్జిన్ అందుబాటులోకి వస్తుందనే ప్రచారం ఊపందుకున్నది. మరోవైపు సుమారు ఏడు వేల మంది సిబ్బందికి సంబంధించిన సమగ్ర వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. వ్యాక్సిన్ వస్తే ముందుగా వీరందరితోపాటు ఫ్రంట్‌లైన్ వారియర్లకు వ్యాక్సినేషన్ చేసే అవకాశం ఉన్నది. ఈ ఆస్పత్రుల్లోనే ప్రజలందరికి వ్యాక్సిన్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది. పారామెడికల్ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారం.

రైతుల ఆందోళనను పరిగణించాలి

కరీంనగర్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో గత వారం రోజులుగా శాంతియుతంగా తమ డిమాండ్ల సాధనకు నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం లాఠీఛార్జీ చేయడం దారుణం అని లెఫ్ట్ నేతలు అన్నారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, మూడు వ్యవసాయ బిల్లులు ఉప సంహరించుకోవాలనే డిమాండ్‌తో రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రైతులపై మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా నూతన వ్యవసాయ చట్టాన్ని వ్యతిరేకించి చేతులు దులుపుకోకుండా కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలను నిలదీయాలన్నారు. రైతాంగ ఉద్యమాలతో కలిసి రావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

చివరి ఆయకట్టు వరకు నీటి విడుదల

–కాల్వల పునరుద్ధరణతో పెరిగిన భరోసా

కరీంనగర్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఈ యేడాది వానకాలం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడడంతో సాగు విస్తీర్ణంకూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గత రబీ సీజన్‌లో 13 లక్షల ఎకరాలకు నీరు అందించగా, ఇప్పుడు సాగు మరింత పెరిగే అవకాశమున్నదని భావిస్తున్నారు. ఆ మేరకు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక తయారు చేశారు. మరోవైపు ఇప్పటికే కాలువలను ఆధునీకరించడంతో చివరి భూములకు నీరందేలా పరిస్థితి ఏర్పడింది. కాలువల మరమ్మత్తులతో రైతులు కూడా నీటి విడుదలపై ఆశాజనకంగా ఉన్నారు. ఈ నీటిని ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేయనున్నారు. చెరువులు నిండి, భూగర్భజలాలు పెరగడాన్ని పరిగణించి సాగులెక్కలు వేస్తున్నారు. యాసంగి సీజన్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరివ్వాలని నిర్ణయించింది. ఎగువ ఎల్ఎండీ పరిధిలోని ఆయకట్టుకు 46 టీఎంసీలు, దిగువ ఎల్ఎండీ పరిధిలోని ఆయకట్టుకు 40 టీఎంసీలు నీరు అవసరం పడుతుందని అధికారులు అంచనా వేశారు. వాతావరణ పరిస్థితులు సహకరించకపోయినా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి వరకూ ఇవ్వాలని కాకతీయ కాలువ మరమ్మతులు, ఆధునీకరణ చేయడంతోనే ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నీటిని చివరి వరకూ నీరు ఇవ్వడం సాధ్యమవుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. నిర్దారిత సామర్థ్యం మేరకు నీళ్లు ఇవ్వాలంటే 50 శాతానికి పైగా పాడైపోయిన కాకతీయ కెనాల్‌ను బాగుచేయాలని నిర్ణయించారు. లైనింగ్‌తోపాటు 63 డిస్టిబ్యూటరీల పరిధిలో కాలువలను ఆధునీకరించింది. ముందుచూపుతో చేసిన ఈ పనుల వల్ల ప్రస్తుతం చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలు పడింది.

ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ అందించడమే లక్ష్యం

భారత్‌తోనూ సంప్రదింపులు జరుపుతున్నాం

ఫైజర్ అధికార ప్రతినిధి వెల్లడి

లండన్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఫార్మా సంస్థ ఫైజర్ బయోఎన్‌టెక్ సంస్థలు కలిసి అభివద్ధి చేసిన కరోనా వ్యాక్సిన్ మరికొన్ని రోజుల్లోనే బ్రిటన్‌లో అందుబాటులోకి రానున్న విషయం తెలిసిందే. దీంతో ఫైజర్ వ్యాక్సిన్‌ను అనుమతించిన తొలి దేశంగా బ్రిటన్ నిలిచింది. ఈ నేపథ్యంలో భారత్‌లోనూ ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తేవడానికి ఉన్న అవకాశాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫైజర్ వెల్లడించింది. 'ఇప్పటికే బ్రిటన్‌లో అనుమతి పొందిన కరోనా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఇందులో భాగంగా, భారత్‌తోనూ చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఫైజర్ అధికార ప్రతినిధి ప్రకటించారు. ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ అందుబాటులో తేవడమే లక్ష్యంగా ఫైజర్ పనిచేస్తోందని.. దీనిపై ఆయా ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నామని ఫైజర్ ప్రతినిధి పేర్కొన్నారు. కరోనా మహమ్మారి విజంభిస్తోన్న నేపథ్యంలో కేవలం ప్రభుత్వాలతో ఒప్పందం ప్రకారమే ఫైజర్ ఈ వ్యాక్సిన్‌ను పంపిణీ చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా నియంత్రణ సంస్థల అనుమతులకు అనుగుణంగానే తమ సంస్థ నడుచుకుంటుందని ఫైజర్ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. భారత్‌లో వ్యాక్సిన్‌ను అందుబాటులో తేవడానికి ఫైజర్ ప్రయత్నిస్తున్నప్పటికీ అది ఇప్పట్లో సాధ్యమయ్యేట్లు కనిపించడం లేదు. ఈ వ్యాక్సిన్‌ను అతి తక్కువ ఉష్ణోగ్రతల(7÷–ఖ0 డిగ్రీలు) వద్ద నిల్వ ఉంచడమే ప్రధాన సమస్య అని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్ ఈ మధ్యే పేర్కొన్నారు.

వాలంటీర్లు జాతి హితవరులు...!

(05 డిసెంబర్ 'అంతర్జాతీయ వాలంటీర్ల దినం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు మరియు స్వచ్ఛంద సేవా సంస్థలు తమ ఉన్నత నైపుణ్యాలను, అపార విజ్ఞానాన్ని, అపూర్వ అనుభవాన్ని మరియు అమూల్య సమయాన్ని వెచ్చించి మానవాళి జీవన సరళతకు మరియు సమాజాభివృద్ధికి ఎంతోగానో తపన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న వాలంటీర్లను గుర్తిస్తూ 1985లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతియేటా 05 డిసెంబర్ రోజున "అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినం" పాటించుట జరుగుతోంది. ప్రపంచాభివృద్ధిలో ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సేవకుల కృషిని ఆహ్వానించడానికి మరియు సమాజ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సఫలతలో వారి పాత్రను గుర్తించడానికి ఈ అంతర్జాతీయ వాలంటీర్ల దినం ఉద్దేశించబడింది. స్థానిక, రాష్ట్ర, దేశ మరియు విశ్వ స్థాయిలో మానవాళి అభివృద్ధి మరియు ప్రపంచ శాంతి నెలకొల్పుటలో వాలంటీర్లు మరియు ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు (యన్‌జిఓ) ఎనలేని సేవలను అందిస్తున్నారు. పలు సమస్యలు మరియు సవాళ్ళకు ఎదురొడ్డి సమాజ సేవలో పుణీతులైన ఆదర్శ సేవకులను గుర్తించి, కృతజ్ఞతలు తెలిపి, సన్మానించాల్సిన సందర్భమిది. కోవిడ్–19 విజృంభనతో మానవాళి సేవలో నిమగ్నమైన వాలంటరీ కార్యకర్తలు అమూల్య సేవలను అందించుట మనందరికి గుర్తుంది. వైద్య, సామాజిక మరియు పారిశుధ్య రంగాల్లో స్వచ్ఛంద కార్యకర్తలు ప్రాణాలకు తెగించి అనంత మానవీయతను ప్రదర్శించారు. అంతర్జాతీయ వాలంటీర్ల దినం–2020 నినాదంగా 'స్వచ్ఛందంగా అందరం కలిసి అద్భుతాలు సాధిద్దాం'ను తీసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వాలంటీర్ల మరియు స్వచ్ఛంద సేవా సంస్థల కృషికి సంఘీభావం తెలుపుతూ, ఆశావహ భావన మరియు త్యాగనిరతిని కొనియాడాల్సిన శుభ సందర్భ వేదికగా ఈ రోజును నిర్వహించుకోవాలి. అంతర్జాతీయ వాలంటీర్ల దినం వేదికగా ర్యాలీలు, పరేడ్‌లు, స్వచ్ఛత సేవలు, రక్తదానాలు, సదస్సులు, ప్రదర్శనలు, నిధుల సేకరణలు, కార్యశాలలు, విద్యాసంస్థల్లో సేవా కార్యక్రమాలు మరియు స్వచ్ఛంద సేవకులకు సన్మానాలు లాంటి కార్యక్రమాలను చేపట్టవచ్చు. ప్రపంచవ్యాప్తంగా నేడు 109 మిలియన్ల వాలంటీర్లు తమ సేవలను ప్రపంచ నలుమూలల అందిస్తున్నారు. 2019లో 8,282 ఐరాస వాలంటీర్లు 54 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 183 పౌర సంస్థలతో కలిసి 13,186 మంది వాలంటీర్లు ఆన్‌లైన్ సేవలను అందించారు. ఐరాస వాలంటీర్లలో 51 శాతం మహిళలు మరియు 29 శాతం యువత ఉండడం విశేషం. సంక్షోభ సమయాలు, ప్రకృతి వైపరీత్యాలు మరియు అత్యవసర వేళల్లో అందరి కన్న ముందు నిలిచే ధీర వాలంటీర్లు, తమ జీవితాలను పణంగా పెట్టి మానవీయతను ప్రదర్శించుట జరుగుతోంది. అంతర్జాతీయ రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్బులు, రోటరీ క్లబ్బులు, యన్‌సిసి, యన్‌యస్‌యస్, స్వచ్ఛంద సంస్థలు, యన్‌జిఓలు లాంటి అనేక వాలంటరీ ఆర్గనైజేషన్లు దేశవ్యాప్తంగా వెలకట్టలేని నిస్వార్థ సేవలను అందించి మనందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మంచి వారిని గుర్తిస్తేనే, నిస్వార్థ సేవలు వెల్లివిరుస్తాయి. అందుకే స్వచ్ఛంద సేవకులుగా మారుదాం, నిస్వార్థ సేవలకు పూనుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌కే మొదటి ప్రాధాన్యత

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
అన్నిశాఖల ఉద్యోగుల డేటా బేస్ ఇవ్వండి
కరోనా వ్యాక్సిన్ పంపిణీకి టాస్క్‌ఫోర్స్ కమిటీ
అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశం

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కోవిడ్1÷–ఖ9 మొదటి దశ వ్యాక్సినేషన్ కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో వ్యాక్సినేషన్ నిమిత్తం మొదటి ప్రాధాన్యతగా ఫ్రంట్‌లైన్ వర్కర్స్ అయిన ఆరోగ్యకార్యకర్తలు, పోలీసుసిబ్బంది, శానిటేషన్ సిబ్బందితో కూడి డేటా బేస్ తయారు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి స్టీరింగ్‌కమిటీ మొదటి సమావేశం గురువారం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్రంలో కోవిడ్ వ్యాక్సినేషన్ సన్నద్ధతపై కమిటీ చర్చించింది. ఈసందర్భంగా సీఎస్ సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ కోవిడ్ వ్యాక్సినేషన్‌కు సంబంధించి కోల్డ్‌చైన్ సౌకర్యాలు, రవాణా, వైద్య సిబ్బందికి శిక్షణ, లాజిస్టిక్‌ఏర్పాట్లు, ఇఐసి ప్రచారం, వైద్య సౌకర్యాల మ్యాపింగ్ తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. వ్యాక్సినేషన్ సెంటర్ల నిర్వహణకు అవసరమైన ప్రోటోకాల్‌ను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, అడిషనల్ డీజీ జితేందర్, యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, హూంశాఖ కార్యదర్శి రవిగుప్త, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జ, పంచాయితీరాజ్‌శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్‌సుల్తానియా, మైనార్టీ కార్యదర్శి అహ్మద్‌నదీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

అంబులెన్స్ సర్వీస్ ప్రారంభించిన జోగు

ఆదిలాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.

ల్లాలో పేదలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని రామన్న అన్నారు.

శుక్రవారం జిల్లా వైద్య శాఖ అధికారి కార్యాలయంలో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన అంబులెన్స్‌ను ఆయన కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రీ అంబులెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. అంబులెన్స్ నిర్వహణ విషయంలో వైద్య అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో బిజేపి ముందంజ

ఇవే ఫలితాలు కొనసాగుతాయన్న రాజాసింగ్

హైదరాబాద్,డిసెంబర్4 (ఆర్ఎన్ఎ): పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో మెజారిటీ స్థానాల్లో భారతీయ జనతాపార్టీ ఆధిక్యంలో ఉంది. పోస్టల్ బ్యాలెట్ల ఫలితాలే నిజమవుతాయని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బీజేపీపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. ప్రతి కౌంటింగ్ సెంటర్లలో బీజేపీకే ఓట్లు వస్తున్నాయన్నారు. సాయంత్రానికి బీజేపీకి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నానన్నారు. బీజేపీ మేయర్ కావాలని ప్రజలు కోరుకుంటన్నారన్నారు.

కేసీఆర్, కేటీఆర్ మాటలను ప్రజలు పట్టించుకోలేదని రాజాసింగ్ పేర్కొన్నారు. ప్రధాని మోడీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. దీనిపై స్పందించిన బీజేపీ నేత రాకుష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కల్వకుంట్ల కుటుంబంపై తిరగపడ్డారని, జనతా గ్యారేజీవైపు నిలుచున్నారని.. ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. టీఆర్ఎస్‌ను ఎదుర్కోగలిగే శక్తి ఒక్క భారతీయ జనతా పార్టీకే ఉందన్నారు. పోలీసులు, ఈసీని అడ్డం పెట్టుకుని, బీజేపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయించి... జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అడ్డదారిలో గెలవాలని ప్రయత్నించిందని విమర్శించారు. అయినా ప్రజలు బీజేపీ పక్షాన నిలిచారని అన్నారు. ఆఖరి సమయంలో 12 నుంచి 18 శాతం ఓటింగ్ పెరిగిందని, అధికారపార్టీ రిగ్గింగ్ చేయించిందని రాకేష్ రెడ్డి ఆరోపించారు. గల్లీ ఎన్నికలకు ఢిల్లీ నాయకులు వచ్చారన్న విమర్శల్లో అర్థంలేదన్నారు.

తెలంగాణలో రహదారి భద్రత భేష్

–ప్రభుత్వ చర్యలకు సుప్రీం కమిటీ సంతృప్తి

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): రహదారి భద్రత పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల సుప్రీం కోర్టు కమిటీ సంతప్తివ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించేందుకు మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కమిటీ ఆదేశించింది. జస్టిస్ అభయ్ మనోహర్ సాప్రే అధ్యక్షతన రహదారి భద్రతపై ఏర్పాటైన సుప్రీం కోర్టు కమిటీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రహదారి భద్రత చర్యలను సమీక్షించింది.

ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నిశాఖలతో ఈనెల 11వ తేదీన సమావేశమై రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై చర్చించనున్నట్టు కమిటీకి తెలిపారు. ఈ సమావేశంలో రవాణా,రోడ్డు , భవనాల శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, అడిషనల్ డీజీ జితేందర్, హూంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్త, రవాణాశాఖ కమిషనర్ ఎంఆర్ఎం రావు, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్‌ఇన్‌చీఫ్ గణపతిరెడ్డి , జాతీయ రహదారుల అథారిటీ రీజినల్ ఆఫీసర్ కష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులను అభినందించిన హూం మంత్రి

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లలో అత్యుత్తమమైన 10 పోలీస్ స్టేషన్లను ఎంపిక చేస్తారు. ఆయా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, ప్రజాభిప్రాయం వంటి అంశాల ప్రాతిపదికన ఎంపిక చేసిన 10 పోలీస్స్టేషన్లలో తెలంగాణ రాష్ట్రం నుంచి జమ్మికుంట పోలీస్ స్టేషన్ కూడా ఎంపికైంది. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఎంపిక కావడం పట్ల రాష్ట్ర హూంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ హర్షం వ్యక్తం చేశారు. 2020 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పది పోలీస్స్టేషన్లలో తెలంగాణ రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ ఎంపిక కావడం పై పోలీస్ అధికారులను హూం మంత్రి అభినందించారు. రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి ని, కరీంనగర్ కమిషనర్ కమల్ హాసన్ రెడ్డి ని, జమ్మికుంట పోలీస్ సిబ్బందిని హూంమంత్రి ప్రశంసించారు .కాగా, వరుసగా రెరడవసారి కరీం నగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్ గా నిలిచింది. ఉత్తమ పౌర సేవలు పోలీసింగ్ అమలుకు గాను 2019 సంవత్సరం లో కరీంనగర్ కు చెందిన చొప్పదండి పోలీస్ స్టేషన

2024 ఎన్నికల్లో బరిలో నిలుస్తా

మళ్లీ నాలుగేళ్లకు కలుస్తా..

వైట్‌హౌజ్ అతిథులతో ట్రంప్

న్యూయార్క్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో హూరాహూరీ పోరాడినా ఫలితం దక్కకపోవడంతో నిరాశకు లోనైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తన సన్నిహితులతో చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. క్రిస్మస్ పార్టీ సందర్భంగా తనకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన అతిథులతో ట్రంప్ మాట్లాడుతూ నాలుగేళ్లు అద్భుతంగా గడిచాయని చెప్పుకొచ్చారు. నాలుగేళ్ల పాటు వైట్‌హౌస్‌లో అప్రతిహత పాలన సాగించిన డొనాల్డ్ ట్రంప్ వేటినీ లెక్కచేయలేదు. అమెరికా ఫస్ట్ నినాదంతో ఇతర దేశాలకు కంట్లో నలుసుగా మారారు. చివరికి అధ్యక్ష ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరతానన్న అతి విశ్వాసంతో ఉన్నారు. కానీ చివరి నిమిషంలో బైడెన్ హవాతో ట్రంప్ అనూహ్యంగా వెనుకబడిపోయారు. దీంతో ఆయన ఎన్నికల అక్రమాలపై పోరాటం చేస్తున్నారు. అయితే అక్రమాలకు తగిన ఆధారాలు చూపడంలో మాత్రం ట్రంప్ విఫలమయ్యారు. దీంతో బైడెన్ గెలుపు ఖాయంగా మారింది. బైడెన్ గెలుపు తప్పదని తేలిపోవడంతో ఎన్నికల అక్రమాలపై పోరాటం చేస్తూనే అధికార మార్పిడికి సహకరిస్తానని ట్రంప్ తాజాగా వెల్లడించారు. ఇప్పుడు తనను కలిసిన సన్నిహితులతో మాట్లాడుతూ నాలుగేళ్లు అద్భుతంగా గడిచాయి. మరో నాలుగేళ్లు అధికారం ఉంటుందని భావిస్తున్నా, అందుకోసం న్యాయపోరాటం చేస్తున్నా, కుదరకపోతే నాలుగేళ్ల తర్వాత మరోసారి పోటీ చేస్తానంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన కీలక నేతలు, పవర్ బోకర్లుగా భావించే వారు పాల్గొన్న ఈ పార్టీలో ట్రంప్ వ్యాఖ్యలు క్షణాల్లోనే అమెరికాలో వైరల్ అయ్యాయి.

గుడ్‌న్యూస్.. కాంటాక్ట్‌లెస్ కార్డ్ ట్రాన్సాక్షన్ పరిమితి రూ.5000

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కస్టమర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. కాంటాక్ట్‌లెస్ కార్డ్ ట్రాన్సాక్షన్ల పరిమితిని వచ్చే జనవరి 1 నుంచి రూ.2000 నుంచి రూ.5000కు పెంచుతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత కరోనా కాలంలో డిజిటల్ పేమెంట్స్ మరింత సురక్షిత వాతావరణంలో జరగాలన్న ఉద్దేశంతో పరిమితిని పెంచినట్లు ఆర్బీఐ చెప్పింది. టెక్నాలజీ వినియోగం ఎక్కువ కావడంతో కాంటాక్ట్‌లెస్ కార్డ్ ట్రాన్సాక్షన్లు, యూపీఐ పేమెంట్లు పెరిగిపోయాయని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఇవి డిజిటల్ పేమెంట్లను మరింత సురక్షిత వాతావరణంలో జరిగేలా చూస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కాంటాక్ట్‌లెస్ ట్రాన్సాక్షన్ల పరిమితి అధికారాన్ని కూడా ఈ మధ్యే కస్టమర్లకు కట్టబెట్టారు. తాజా పరిమితి పెంపుపై కూడా కస్టమర్‌కే విచక్షణాధికారం ఉంటుందని శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ఇక రానున్న రోజుల్లో భారీ మొత్తాల లావాదేవీల కోసం ఉపయోగించే రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్టీజీఎస్)ను 24 గంటలూ అందుబాటులో ఉంచేలా చేస్తామని కూడా ఆర్బీఐ ప్రకటించింది. ఇప్పటికే గతేడాది డిసెంబర్ నుంచి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్) 24 గంటలూ అందుబాటులోకి వచ్చింది.

జపాన్‌లో ఉచిత కరోనా టీకా

బిల్లు ఆమోదించిన ప్రభుత్వం

టోక్యో,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో..తమ ప్రజలందరికీ ఉచితంగా కొవిడ్1÷-ఖ9 టీకాను అందించాలని జపాన్ ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం దానికి సంబంధించిన బిల్లును కూడా పాస్ చేసింది. 12.6 కోట్ల జనాభా టీకా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ఈ బిల్లు వెల్లడిచేస్తోంది. 8.5 కోట్ల మంది ప్రజలకు టీకాలు అందించే లక్ష్యంతో అమెరికన్ తయారీ సంస్థలైన ఫైజర్, మోడెర్నాలతో జపాన్ ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అలాగే 12 కోట్ల డోసుల ఆస్ట్రాజెనెకా టీకాను పొందనున్నట్లు ఆ దేశం తెలిపింది. ఇదిలా ఉండగా..క్లినికల్ ప్రయోగాల్లో మంచిపని తీరును ప్రదర్శించిన మోడెర్నా, ఫైజర్ ఇప్పటికే అత్యవసర వినియోగం కోసం అనుమతులకు దరఖాస్తు చేసుకున్నాయి. తాజాగా ఫైజర్ టీకా అత్యవసర వినియోగానికి యూకే అనుమతి మంజూరు చేసింది. దేశంలో వైరస్ ఉద్ధతి తీవ్రంగా ఉందని రెరడు వారాల క్రితం జపాన్ ప్రధాని ఆందోళన వ్యక్తం చేసిన అనంతరం ఈ బిల్లుకు ఆమోదం లభించింది.

కరోనా ముప్పు ఇంకా తొలగలేదు

వ్యాక్సిన్‌తో వైరస్÷-ను పూర్తిగా నిర్మూలించలేం

ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ సంచలన వ్యాఖ్య

జెనీవా,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న వేళ ఐరాస తీవ్ర హెచ్చరిక చేసింది. వ్యాక్సిన్ వచ్చినా తాత్కాలిక ఉపశమనమేనని ఇది మనతో శాశ్వతంగా ఉంటుందని తెలిపింది. కరోనా ఇప్పటికే కోట్లాది మందికి సోకింది. కరోనా మహమ్మారి వలన ఇప్పటికే లక్షలాది మంది మృతి చెందారు. కరోనా టీకా అందుబాటులోకి వస్తే వైరస్ కు అడ్డుకట్ట వెయ్యొచ్చని అంటున్నారు. అయితే, టీకా అందుబాటులోకి వచ్చినా మహమ్మారిని కట్టడి చేయడం కష్టం అని, అలా భావించడం పిచ్చితనమే అవుతుందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పేర్కొన్నారు. కరోనా మహమ్మారి దశాబ్దాలపాటు కొనసాగుతుందని అన్నారు. శాస్త్రవేత్తలు నిబద్ధతతో పోరాటం చేస్తున్నారని అన్నారు. యూకే ప్రభుత్వం ఫైజర్ టీకాకు అత్యవసర అనుమతి ఇచ్చిన తరువాత ఆంటోనియో ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి మొదలై సంవత్సరం పూర్తయ్యింది. ఇప్పటి వరకు ఈ వైరస్ బారినపడి ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు కరోనా వ్యాక్సిన్ కోసం కృషి చేస్తున్నాయి. దాదాపు అన్ని దేశాల వ్యాక్సిన్ ప్రయోగాలు పరీక్షలు తుదిదశలో ఉన్నాయి. అయితే ఫైజర్ టీకాను అత్యవసర వినియోగం కోసం యూకే ఆమోదం తెలిపింది. కరోనా వ్యాక్సిన్ పై ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఐరాస సాధారణ సభ సమావేశాల్లో పాల్గొన్న ఆయన.. కరోనా వైరస్ కొన్ని దశాబ్దాలపాటు ఉంటుందని అన్నారు. కరోనా మొదలై దాదాపు ఏడాది పూర్‌ఖైంది. 1945 తర్వాత యావత్ ప్రపంచానికి మొదటి సారి ఉమ్మడి ప్రమాదం ఏర్పడింది. ఈ వైరస్ ప్రభావం ఇప్పట్లో తగ్గదు. వ్యాక్సిన్ వచ్చిన కరోనా మాయమై పోతుందని అనుకుంటే పిచ్చితనమే.. కాలమే దీనికి పరిష్కారం చూపుతుంది. వ్యాక్సిన్ మన దగ్గర ఉన్న ఇతర సాధనాలను పూర్తి చేస్తుంది.. కానీ, వాటిని తొలగించదని తెలిపారు. కరోనా వ్యాక్సిన్ కోసం కృషి చేసిన ప్రతీ శాస్త్రవేత్తకు ధన్యవాదలు చెప్పుకుంటున్నానని తెలిపారు. కానీ వ్యాక్సిన్ వచ్చిన కరోనా నుంచి ప్రమాదం తప్పదని, దీని ప్రభావం సంవత్సరాల తరబడి ఉంటుందని గుటెర్రెస్ హెచ్చరించారు. కరోనా వలన ప్రపంచం మొత్తం ఆర్థికంగా, ఆరోగ్యంగా తీవ్రంగా నష్టపోయిందని, తిరిగి మాములు స్థితికి రావడానికి కాస్త సమయం పడుతుందని గుటెర్రెస్ చెప్పారు. డబ్ల్యూహెచ్ఓ చీఫ్ సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారని, కాబట్టి ప్రజలంతా కరోనా వైరస్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు.

బోల్తాపడ్డ కంటెయినర్

ప్రాణాపాయం నుంచి తప్పుకున్న డ్రైవర్

అనంతపురం,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి సమీపంలో యర్రంపల్లి పెట్రోల్ బంక్ వద్ద హోండా బైకులతో వెళ్తున్న కంటెయినర్ అదుపుతప్పి బోల్తాపడింది. హర్యానా నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఈ కంటెయినర్ లో హోండా ద్విచక్ర వాహనాలు.. స్పేర్ పార్ట్స్ తో వెళుతోంది. తెల్వారుజామున 4 గంటల ప్రాంతంలో కంటైనర్ గూడ్స్ వెహికల్ అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు. క్లీనర్ గఫార్ కు స్వల్ప గాయాలు కాగా.. డ్రైవర్ సద్దాం క్షేమంగా ఉన్నాడు.

కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా రేయింబవళ్ళు వాహనాల తనిఖీలు

కరీంనగర్. డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి):ఎల్‌యండి, కరీంనగర్ త్రీటౌన్, వన్‌టౌన్ పరిధిలో వరుసగా జరిగిన మెడల్లోని పుస్తెలతాళ్ళు, చైన్లను లాక్కెళ్ళిన సంఘటనలు జరిగిన నేపథ్యంతోపాటు అక్రమ కార్యకలాపాల నియంత్రణ కోసం కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు గురువారం రాత్రి నుండి ఆకస్మిక వాహనాల తనిఖీలను కొనసాగిస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీల సందర్భంగా అనుమానిత వాహనాలను ఆపి సదరు వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలను పరిశీలిస్తున్నారు.

వాహనాల తనిఖీ కమిషనరేట్ వ్యాప్తంగా వివిధ రకాల సమయాల్లో కొనసాగిస్తున్నారు. ప్రధాన రోడ్లపైనే కాకుండా అనుమానిత వ్యక్తులు సంచరించేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. వరుసగా జరిగిన దొంగతనాలను చేధించడం లక్ష్యంగా పోలీసులు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీల సందర్భంగా వాహనదారులు అతివేగంగా వెళ్ళకుండా ఉండటంతోపాటు పోలీసుల వ్వరూ గాయాలబారిన పడకుండా మోబైల్ బారికేడ్లను ఏర్పాటు చేసి తనిఖీలను కొనసాగిస్తున్నారు. మహిళల మెడల్లోని పుస్తులతాళ్ళు, ఇతర రకాల చైన్లను లాక్కెళ్ళిన దొంగల సంచారం సిసి కెమెరాల్లో నిక్షిప్తమైన ఫోటోలను వివిధ సోషల్‌మీడియా గ్రూపుల్లో పోస్టులు పెడుతూ సదరు దొంగల సంచారానికి సంబంధించిన సమాచారం సేకరణలో నిమగ్నమయ్యారు. పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి, అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), కరీంనగర్, టౌన్, రూరల్ ఏసిపిలు పి అశోక్, జె విజయసారథిలో ప్రత్యక్ష్యంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ తనిఖీల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఈ వాహనాల తనిఖీలను కొనసాగిస్తున్నారు.

పాత నేరస్థుల కదలికలపై సమాచారం సేకరణ

2015 వరకు వివిధ రకాల నేరాలకు పాల్పడిన నేరస్థులు ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారో గుర్తించడంతోపాటు, వాళ్ళు ప్రస్తుతం జీవనాధారంకోసం ఏంపనులు చేస్తున్నారనే విషయాలను ఆరా తీస్తున్నారు. గతంలో నేరాలకు పాల్పడిన నేరస్థులు ప్రస్తుతం మకాం మార్చేందుకు కారణాలను కూడా అన్వేషిస్తున్నారు.

సునిశిత పరిశీలన, లోతైన దర్యాప్తులతో నేరాలను చేధించవచ్చు

వివిధ రకాల దోపిడి,దొంగతనాలకు సంబంధించిన విషయాల్లో సునిశిత పరిశీలన, లోతైన దర్యాప్తులతో నేరాలను చేధించవచ్చని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. గతనెల 29న కొత్తపల్లి మండలంలోని బావుపేట గ్రామంలో ట్రాక్టర్ దొంగతనం కేసు చేధించడంలో కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, సిసిఎస్ పోలీసులు నిద్రాహారాలుమాని, కేసు చేధన కోసం శ్రమించి సదరు నిందితుడిని సిసి కెమెరాల్లో నిక్షిప్తమైన ఆధారాలతో పట్టుకున్నారని ఈ నేర సంఘటన కమిషనరేట్ పోలీసులందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రైంబృందాలకు చెందిన పోలీసులతోపాటు, కమిషనరేట్‌లోని వివిధ స్థాయిలకు చెందిన పోలీసులునేరాల చేధనపైనే ఈనెలలో దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.

రిజినేరాల చేధన ద్వారా నిందితులు శిక్షింపబడితే పోలీస్‌శాఖ ప్రతిష్ట ప్రజల్లో మరింత పెంపొందుతుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు.

మోటార్ వాహనాల దొంగతనాల చేధనపై కూడా దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. కమిషనరేట్‌లో అందుబాటులో ఉన్న టెక్నాలజీని నేరాల చేధనకోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాహనాల తనిఖీలను నిర్వహించే ప్రత్యేక బృందాలకు సరైన విశ్రాంతిని కల్పిస్తూ ఈ పక్రియను కొనసాగిస్తున్నారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకురావాలి

నేరాల చేధన, నియంత్రణకు దోహదం డే సిసి కెమెరాల ఏర్పాటుకోసం అన్నివర్గాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకురావాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పిలుపునిచ్చారు.వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలు పర్యవేక్షణలోపం కారణంగా కొన్ని పనిచేయడం లేదని, దాతలు తమవంతు విరాళాలు అందజేసి సిసి కెమెరాల మరమ్మత్తులకు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ మధ్యకాలంలో అనేక నేరసంఘటనలు సిసి కెమెరాల ఫుటేజీల ద్వారానే చేధించబడ్డాయనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. గ్రామాల ప్రవేశం, తిరిగివెళ్ళే దారుల్లో ఈ సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తే మరిన్ని సత్ఫలితాలను సాధించవచ్చని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

ఈనెల 12న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎక్కువ కేసుల పరిష్కారంలో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచే పోలీస్‌స్టేషన్లకు చెందిన అధికారులకు శాఖాపరంగా రివార్డులను అందజేస్తామని ప్రకటించారు.

జాతీయస్థాయిలో గుర్తింపునకు మిగతా పోలీస్‌స్టేషన్లకు అవకాశం ఉంది

2019లో చొప్పదండి జాతీయ స్థాయిలో 08వస్థానం, ఈ సంవత్సరం జమ్మికుంట టౌన్ పోలీస్‌స్టేషన్ జాతీయ స్థాయిలో 10స్థానం గుర్తింపు పొందిన విషయం విదితమే. ఇలా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం కోసం కరీంనగర్‌లోని మరిన్ని పోలీస్‌స్టేషన్లకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, ఎస్‌హచ్ఓస్థాయి అధికారులతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పై పోలీస్‌స్టేషన్లను స్ఫూర్తిగా తీసుకుని జాతీయస్థాయిలో గుర్తింపుపొందేందుకు అసాధారణమైన సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కేసునమోదైన 60రోజుల వ్యవధిలోపు నాణ్యత ప్రమాణాలతో దర్యాప్తులను పూర్తిచేసి, సిసిటిఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయడం, పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును మెరుగుపరుచుకుని సమర్ధవంతంగా పనిచేయడంతోపాటు ఫిర్యాదులపై సత్వరం స్పందిస్తూ, వేగవంతంగా చర్యలు తీసుకోవడం, పోలీస్‌స్టేషన్‌లో అహ్లాదకరమైన వాతావరణ ఏర్పాటు చేయడం, కనీస సౌకర్యాలు కల్పించడం, దివ్యాంగుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడం, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవడం, నేరాలను వేగవంతంగా చేధించడం ద్వారా ఎంపిక పక్రియలో చోటులభిస్తుందని చెప్పారు. తర్వాత కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్నివర్గాల ప్రజలను కలిసి స్వీకరించే ఫీడ్‌బ్యాక్‌తో ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. వరుసగా మూడోసారి కరీంనగర్ కమిషనరేట్ జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తే పోలీస్‌స్టేషన్ల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తాయని తెలిపారు. జిల్లాలోని ఎల్‌యండి, రామడుగు, సైదాపూర్, వీణవంక, గన్నేరువరం పోలీస్‌స్టేషన్లకు ఈ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులు వృత్తిపట్ల నిబద్ధత, ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీలేదనే ఆత్మస్థైర్యం ఉండాలని తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా జరిగిన వివిధ రకాల శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలను ఎక్కువగా వెలుగులోకి తీసుకరావడంలో ప్రింట్ అండ్ ఎలక్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రధానపాత్ర పోషించారని, పోలీసులకు లభించిన గుర్తింపులో 50శాతం క్రెడిట్ వారికే దక్కుతుందని, సహకరించిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్ధరాత్రి ఎన్నికల సంఘం ఉత్తర్వులు

స్వస్తిక్ గుర్తునే పరిగణించాలని ఇసికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఓ వైపు గ్రేటర్ ఎన్నికల పోలింగ్ ఉత్కంఠ రేపుతోన్న సమయంలో.. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎప్పుడూ లేని విధంగా జారీ చేసిన ఓ సర్క్యులర్‌ను రాష్ట్ర హైకోర్టు రద్దు చేసింది. ఓటేయడానికి ఉద్దేశించిన స్వస్తిక్ ముద్రతో పాటు ఏ గుర్తు ఉన్నా ఓటుగా పరిగణించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే... ఎన్నికల సంఘం ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో భారతీయ జనతా పార్టీ హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు... తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సర్క్యులర్‌ను సస్పెండ్ చేసింది. దీంతో.. ఎన్నికల కమిషన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలినట్టు అయ్యింది. అయితే, ఎలక్షన్ కమిషన్ సర్క్యూలర్ ను సస్పెండ్ చేసిన హైకోర్టు... గెలుపోటముల దగ్గర మార్కింగ్ ఉంటే తుది ఉత్తర్వులకు లోబడి ఫలితాలు వెల్లడించాలని ఆదేశించింది. స్వస్తిక్ గుర్తు ఉన్న బ్యాలెట్ ను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు... వెంటనే అన్ని కౌంటింగ్ కేంద్రాలకు సమాచారం అందించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ ధాఖలు చేయాలన్న హైకోర్టు.. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఇదే తమ తొలి విజయమని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మరోవైపు స్వస్తిక్ గుర్తు కాకుండా పోలింగ్ స్టేషన్ నంబర్లున్న గుర్తుతో ఓటు వేసినట్టు వస్తున్న వార్తలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. స్వస్తిక్ గుర్తు కాకుండా ఏ ఇతర గుర్తుతో ఓటు వేసి ఉన్నా అక్కడ ఓట్ల లెక్కింపును నిలుపుదల చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని రాజకీయపార్టీల దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి పీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ జి.నిరంజన్ లేఖ రాశారు. ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయం అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందన్నారు. తక్కువ సమయంలో ఎన్నికలు నిర్వహించడం వల్లే ఈ తప్పిదాలు జరిగాయని వివరించారు. గ్రేటర్ ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లో స్వస్తిక్ గుర్తు ఉన్నవాటినే కాకుండా సంబంధిత పోలింగ్ కేంద్రాన్ని సూచించే స్టాంపు వేసినా ఓట్లుగా పరిగణించాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పలువురు ఉద్యోగులు ఓటింగ్ సమయంలో ఓటర్లకు స్వస్తిక్ ముద్రకు బదులు పొరపాటున పోలింగ్ కేంద్రం సంఖ్య తెలిపే ముద్రల్ని ఇచ్చామని ఈసీ దృష్టికి తీసుకురావడంతో.. దానికి పరిష్కారంగా అలాంటి ఓట్లనూ లెక్కించాలంటూ ఆదేశాలిచ్చినట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ముద్ర మారినా ఓటర్ల ఎంపిక మారదంటూ అధికారులు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే దీనిని హైకోర్టు తిరస్కరించింది.

యాదాద్రి మోడల్ అటవీ అభివృద్ధి

పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి

చెత్తవేయకుండా ప్రజలు సహకరించాలి

స్వచ్ఛ కరీంనగర్‌కు సహకరించాలన్న కలెక్టర్

కరీంనగర్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): యాదాద్రి మోడల్ మియాకి పల్లె ప్రకృతి వనాల మీద దృష్టి పెట్టాలని కలెక్టర్ శశాంక అన్నారు. రాజీవ్ రహదారులు, స్థలాన్ని బట్టి ఫిట్టింగ్, ప్లాంటేషన్ చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ, పల్లె ప్రకృతి వనం, బండు, బ్లాక్ ప్లాంటేషన్ అర్బన్, రూరల్ ఏరియాల్లో ప్లాంటేషన్ అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ కరీంనగర్‌కు చేస్తున్న కృషిలో ప్రజలు భాగస్వాములు కావాలని కరీంనగర్ కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. నగరాన్ని పరివుభ్రంగా ఉంచడంలో ప్రజలదే ప్రధాన బాధ్యతని అన్నారు. అదేపనిగా చెత్తవేయడం మానుకోవాలన్నారు. ప్రజలు అదేపనిగా వేస్తున్న చెత్త తొలగింపు ప్రధాన సమస్య అన్నారు. ప్రధాన రహదారులపై చెత్త, చెదారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. హరితహారంలో ఇదివరకు నాటిన మొక్కలను వాచర్లు ఎప్పటికప్పుడు నీటితో సంరక్షిం చాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ప్లాంటేషన్ చేయాలన్నారు. గ్రామపంచా యతీ వారీగా ప్లాంటేషన్ చెక్ చేసుకోవాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలకు స్థలాలు సరిపోకుంటే ఆ స్థలంలో అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని సూచిం చారు. అధికారులు ప్రయాణం చేసేటప్పుడు రోడ్లపై మొక్కలు ఉన్నాయా, లేవా, ట్రీ గార్డు లు ఏర్పాటు చేశారా లేదా, వాటర్ సౌకర్యం ఉందా లేదా అని చెక్ చేసుకోవాలన్నారు. మండలానికి ఒక యాదాద్రి మాడల్, మంకీ ఫుడ్ కోర్టు పూర్తయ్యే విధంగా చూడాలని, జియో ట్యాగింగ్ చేయాలని చెప్పారు. సరిహద్దుల నుంచి రోడ్లకు ఇరువైపులా 3 వరుసలు చెట్లు నాటి, వాటిని సంరక్షించాలని అన్నారు. అధికారుల మధ్య సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. పల్లె ప్రకృతి వనాలకు వాటర్ సౌకర్యం, ఫెన్సింగ్ చేయించాలని తెలిపారు. హ్యాబిటేషన్ పనులు గ్రౌడింగ్ చేయించాలని, ప్లలె ప్రకృతి వనాలు సీజనలోగా పూర్తి చేయాలని అన్నారు. 250 ఇళ్లకు ఒక రిక్షాను కేటాయించామని, ప్రతి గ్రామంలో 50 శాతం చెత్త సేకరణ జరగాలన్నారు.

టర్కీలో ఈనెల 11నుంచి కోవిడ్ టీకా

పంపిణీకి ప్రణాళిక ఖరారు

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): టర్కీ దేశం వ్యాక్సినేషన్ ప్రణాళికను ప్రకటించింది. దేశ ప్రజలకు ఈనెల 11వ తేదీ తర్వాత కోవిడ్ టీకాను ఇవ్వనున్నట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ మంత్రి ఫరెట్టిన్ కోకా తెలిపారు. తొలుత హెల్త్ వర్కర్లకు ఆ టీకా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. చైనా కంపెనీ తయారు చేస్తున్న కరోనావాక్ టీకాను టర్కీ కొనుగోలు చేసింది. సుమారు కోటి డోసులు టీకాలను డిసెంబర్‌లోనే ఇవ్వనున్నామని, ఆ తర్వాత జనవరి, ఫిబ్రవరి నెలల్లో మరో కోటి డోసులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. చైనా వద్ద 5 కోట్ల డోసులు కొనేందుకు టర్కీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. అయితే ప్రజలకు ఉచితంగానే వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. అయితే ఇతర దేశాలకు చెందిన టీకాలను ఫార్మసీల్లో అమ్మేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జర్మనీ వద్ద 2.5 కోట్ల కోవిడ్ టీకా డోసులు ఖరీదు చేసేందుకు ఎ÷-లాన్ వేశామని టర్కీ మంత్రి తెలిపారు. చైనాకు చెందిన సైనోవాక్, అమెరికాకు చెందిన ఫైజర్ కంపెనీలు తమ వ్యాక్సిన్ ట్రయల్స్‌ను టర్కీలో నిర్వహిస్తున్నాయి. సైనోవాక్ టీకా మూడవ దశ ట్రయల్స్‌ను సెప్టెంబర్‌లోనే ప్రారంభంచారు. ఇప్పటికే వేలాది మంది వాలంటీర్లు ఆ టీకా తీసుకున్నారు. ఫైజర్ కూడా టర్కీలో ట్రయల్స్ చేసింది.

దేశంలో పెరుగుతున్న కోవిడ్ రికవరీ రేటు

36,604 కొత్త కేసులు నిర్ధారణ

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా విజంభణ కొనసాగుతూనే ఉంది. అయితే, గత కొద్ది రోజులుగా 50 వేల దిగువనే రోజూవారీ కేసులు నమోదవుతున్నాయి. వరుసగా 25వ రోజు 50 వేల కంటే తక్కువగా కేసులు నమోదయ్యాయి. తాజాగా కేంద్ర ఆరోగ్య మంత్

అవకతవకలపై ఇసి దృష్టి సారించాలి

అనుమానాల నివృత్తి చేయగలగాలి
పలుచోట్ల అత్యధికంగా వచ్చిన ఓట్లపై సమాధానం ఇవ్వాలి

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎన్నో అవకతవకలు బయట పడుతున్నాయి. కొన్నిచోట్ల సీలువేసినప్పుడు ఉన్న ఓట్లను మించి ఓట్లు డబ్బాల్లో దర్శనమిస్తున్నాయి. వీటిపై అభ్యంతరాలను అధికారులు పట్టించుకోకుండా లెక్కిస్తామని అనడం సరికాదు. దీనిపై ఆందోళనలు వ్యక్తం చేసినా పట్టించుకోవడం లేదు. జాంబాగ్ తదితర ప్రాంతాల్లో పోలైన ఓట్లకన్నా ఎక్కువ చ్చాయని ఆరోపణలు వచ్చాయి. ఇవిఎంలపై ఉన్న అనుమానాల మూలంగా, కరోనా కారణంగా బ్యాలెట్ పత్రాలు మళ్లీ దర్శనమిచ్చాయి.

ఓటేసిన వారికి ఫలితాలు సజావుగా సాగాలని కోరుకునే హక్కు ఉంది. కానీ ఎన్నికల సంఘం కూడా దీనికి అంగీకరించే స్థితిలో లేదు. గతంలో ఎన్నడూ లేనంతగా ఎన్నికల సంఘం అభాసుపాలవుతోంది. గతంలో ఇవిఎంలు మొరాయించడం మొదలు, ఓటింగ్ శాతంలలో తేడాలు రావడ, వేసిన ఓట్లకన్నా కౌంటింగ్‌లో ఎక్కువ లెక్కకు రావడం వంటి అంశాలు ఇసి నిజాయితీని శంకించేలా చేసా యి. ఇప్పుడు కూడా అలాగే జరిగిన ఘట నలు ఇసి తీరుపై అనుమానాలు కలిగిస్తున్నాయి.

ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన ఎన్నికల సంఘం నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. కొన్ని లోపాలు, లొసుగులు వున్నప్పటికీ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించటం ఎన్నికల కమిషన్ బాధ్యత. అలాగే కౌంటింగ్ కూడా అలాగే సాగాలి. ఎన్నికల్లో ధన బలం వినియోగాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన కమిషన్ తన కర్తవ్య నిర్వహణలో విఫలం కావడం క్షంతవ్యం కాదు. పోలింగ్‌లో భారీయెత్తున రిగ్గింగ్ ఆరోపణలు వచ్చాయి. పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య తేడా వచ్చింది.

అలాగే వేలాదిగా ఓట్లు గల్లంతు అయినట్లుగా ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఇలాంటి అక్రమాలు అవకతవకలు బయట్పడ్డాయి. ఎన్నికల కమిషన్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించి దాని సమగ్రతను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అవసరం. ఇసి నిష్పక్షపాతంగా వ్యవహరించే విధంగా చట్టాన్ని మరింత పారదర్శకంగా రూపొందించుకోవాలి. ఆరోపణలపై తక్షణం ఇసి స్పందించి నిర్ణయాలు తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. అనుమానాలు నివృత్తి చేయడం లేదు. ఓటరు కార్డు ఉన్నా ఓట్లు గల్లంతు అవుతున్న పట్టింపు లేకుండా పోయింది. ఇలా ఉత్పన్నమైన సమస్యలకు అనుమానాలకు ఇసి వద్ద సమాధానం లేదు. వీటికి సమాధానం చెప్పగలిగేలా ఇసి జవాబుదారీగా ఉండేలా చట్టాలు రూపొందించాలి. అధికార పార్టీకి కొమ్ముకాసే విధానాలు పోవాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ప్రజలు కూడా స్వేచ్ఛగా తాము కోరుకున్న పార్టీకే ఓటేసామనే నమ్మకాన్ని పొందుతారు.

ముందుగానే అందుబాటులో ఎరువులు

రైతుల సంక్షేమంలో వెనుకంజ లేదు: పల్లా

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): గతంలో రైతులకు ఎరువుల కొరత ఉండేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతులపై ఎక్కువ శ్రద్ధ చూపడం వల్ల ముందుగానే ఎరువులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని అధికారులు అన్నారు. యాసంగి పంటలకు ముందుగానే అవసరమైన ఎరువులను సిద్ధం చేస్తున్నారు. రైతులు ధాన్యాన్ని ఐకేపీ, సొసైటీ సెంటర్లకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతుబంధు సంఘం అధ్యక్షుడు పల్లా రాజేశ్వర రెడ్డి అన్నారు. ఇతర రాష్ట్రాల రైతులు ధాన్యాన్ని మనరాష్ట్రంలో అమ్మేందుకు ప్రయత్నించడం వల్ల గతంలో మన రైతులకు గిట్టుబాటు ధర అందలేదని, దీనిని నిరోధించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. రైతుకు ముందుగా కావల్సిన విత్తనాలను గ్రామస్థాయిలో ఎవరు అమ్ముతున్నారు. అవి నకిలీవా, మంచివా అనేది కూడా గ్రామస్థాయి రైతు సమాఖ్య సభ్యులు పరిశీలించి రైతులకు తెలియజేయాలన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు గ్రామ రైతుబంధు సమితులు రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆగ్రోప్రాసెస్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతుల ఆత్మహత్యలు నిరోధించడానికి రైతుల సమస్యలు పరిష్కరించి, రైతుల ఆర్థికస్థితిగతులను మెరుగు పర్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీ ఎరువులు, విత్తనాలు పొందవచ్చని తెలిపారు. తాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇప్పటివరకు 99శాతం మిషన్‌భగీరథ పనులు పూర్తయినట్లు చెప్పారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో పండ్ల తోటలను పెంచుకోవచ్చని తెలిపారు. మిషన్‌కాకతీయతో చెరువుల పునరుద్ధరణ జరిగిందన్నారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీని నెరవేర్చడంలో భాగంగా ఇండ్ల నిర్మాణం స్పీడందుకున్నాయన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేస్తామన్నారు. ఇండ్ల కేటాయింపు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, లంచాలకు తావు లేకుండా పారదర్శకంగా ఇస్తామన్నారు.

అమరగాయకుడు మన ఘంటసాల

ప్రాతఃకాల వేళ ఆయన సుమధుర గానం అమృతప్రాయం
ఘంటసాల జయంతి సందర్భంగా ....

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): మంచి పుస్తకం చేతికొస్తే దాని మీద బావుండే అట్ట చూస్తూ మురిసి పోవడం సహజం. ఈ సహజగుణం వల్ల లోపలి పేజీలు అలా అలా తిరగేస్తున్నా మళ్ళీ అట్ట చూస్తే బావుణ్ణు అని అనిపిస్తుంది. ఈ వింత క్రియకి నవ్వు వస్తే దాన్ని 'అట్టహాసం' అనాలి. ఘంటసాల గానం అటువంటి ఒక మంచి పుస్తకం. అతని తలపు అలా మురిపించే అట్ట. లోపలి పేజీల నిండా పాటలే.

ఈ లెక్క తేలక మళ్ళీ మళ్ళీ అట్ట వైపే చూస్తుంటే ఘంటసాల మందస్మితం కనిపిస్తుంది. అట్టహాసం కాదది– అట్టహాసం ఎరుగని గానం అమర గాయకునిది. ఘంటసాల గాత్రం జీవన సూత్రమే కాదు మానవ జన్మకు దివ్యగానామృతం. తన మధుర గానాలతో శ్రోతలను ఆకట్టుకున్న మధుర గాయకుడు ఘంటసాల 98వ జయంతి సందర్భంగా ఆయనను గుర్తు చేసుకోవడం అవసరం. ఘంటసాల తెలుగు సినిమా మొదటి తరం నేపథ్య గాయకులలో ప్రముఖులు. వ్యాఖ్యానంతో సహా ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగు వారిలో అత్యంత ప్రజాదరణ పొందినది. ఘంటసాల గారి పూర్తి పేరు ఘంటసాల వెంకటేశ్వరరావు. ఈయన 1922 డిసెంబర్ 4 న కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. 'నేను పుట్టాను లోకం ఏడ్చింది' అంటూ జననం గురించి పాడినా, 'టాటా వీడుకోలు' అంటూ ఈ లోకాన్ని వీడ్కోలు పలికినా, జననానికీ మరణానికీ మధ్యలో 'నా హృదయంలో నిదురించే చెలీ?' అంటూ ఒక ప్రేమ గీతాన్ని ఆలపించినా,'నిలువవే వాలు కనుల దాన' అంటూ ఒక అమ్మాయిని టీజింగ్ చేసినా 'జగమే మాయ బతుకే మాయ' అంటూ ఒక వైరాగ్య గీతాన్ని ఆలపించినా, 'నేనొక పూల మొక్క కడ నిల్చి' ఒక విలాపాన్ని జనంలోకి విసిరినా ఆయనకే చెల్లింది. ప్రభాత వేళలో ఎం. ఎస్. సుబ్బులక్ష్మి, ఘంటసాల మేలుకొలుపు గళం ఇంట్లో వింటుంటే ఎంత శుభప్రదంగా వుంటుంది!! ఘంటసాల గళం ఎంత అమృతమయమో, తొలినాళ్లలో దుర్భర క్లేశాల్ని ఎదురీదుతూ, తారాస్థాయికి చేరిన ఆయన జీవితం అంత స్ఫూర్తిదాయకం. 11వ ఏటనే తండ్రి మరణంతో అండ కోల్పోయారు. గొప్ప సంగీతజ్ఞుడివి కావాలిరా అన్నది తండ్రి కోరిక. తనక్కూడా సంగీతమంటే ప్రాణం. కాని పూట గడవడమే కష్టం. మేనమామ పంచన చేరింది కుటుంబం. గురుకులాల్లో చేరి సంగీత సాధన చేద్దామంటే తట్టుకోలేని కట్టుబాట్లు... కొందరు సంగీతజ్ఞుల ఇళ్లల్లో వుంటూ

బట్టలు ఉతకడం, వంటావార్పు లాంటి శుశ్రూషలు కూడా చేశాడు. అలాకాదని ఎన్నో తంటాలు పడి విజయనగరం సంగీత కళాశాలలో సీటు పొందాడు. వేసవి సెలవుల్లో ప్రిన్సిపాల్ని బతిమాలి కాలేజీలోనే వుంటూ పూటకో ఇంట భోజనంతో రోజులు కష్టంగా గడిపాడు. స్నేహితులు చేసిన చిన్న తప్పు ఘంటసాల మీదికి తిరిగి కాలేజీలో ఆశ్రయం కాస్తా ఊడిఎ ోయింది. తిండి పెట్టే వాళ్లు కరువయ్యారు. ఊరి శివారులోని ఓ అమ్మవారి గుడి మెట్లే ఆశ్రయమయ్యాయి. అదష్టంకొద్దీ షట్రాయని సీతారామశాస్త్రి గారనే సంగీతజ్ఞుడు ఘంటసాలపై జాలిపడి తన ఇంట్లో చోటిచ్చాడు. చివరికి ఆయనే గురువయ్యాడు. ఆయనది కూడా పేదిల్లే కావడంతో తిండికోసం ఇల్లిల్లూ తిరగాల్సిన పరిస్థితి.. చివరికి ఆ కష్టాలమధ్యే మొక్కవోని పట్టుదలతో శాస్త్రిగారి శష్యరికంలోనే నాలుగేళ్ల కోర్సును రెండేళ్లలో పూర్తి చేశాడు. తన స్వగ్రామం చౌటుపల్లి వచ్చి చుట్టుపక్కల కచేరీలు చేశాడు. చివరికి సముద్రాల వారితో పరిచయం, ఆనక మద్రాసు పయనం, అక్కడ కూడా వుండే వసతి లేక పానగల్ పార్కులో గడిపిన అనేక రాత్రులు... అదో కష్టకాలం. మద్రాసు రేడియో కేంద్రంలో లలిత గేయ గాయకుడిగా ప్రముఖులతో పరిచయాలు పెరిగి స్వర్గసీమ సినిమాలో గాయకుడిగా తొలి అవకాశం దక్కింది. అలా మొదలై పాతాళభైరవి, మల్లీశ్వరి, దేవదాసు, అనార్కలి, మాయాబజార్... ఇలా గాయకప్రస్థానం తిరుగులేకుండా సాగి, సినీ చరిత్రలో ఘంటసాలది ఒక మహోజ్వల అధ్యాయంగా మిగిలింది. 60,70 దశకాల్లో ఆయన పాడిందే పాట అయ్యింది. తెలుగునేల వున్నంతవరకూ వుండిపోయేలా ఆయన గీతామకరందం రుచిచూస్తే కృష్ణపరమాత్మకే గొంతు అరువిచ్చాడా అన్న సంభ్రమం కలుగుతుంది. అన్నం కోసం జోలెపట్టేసప్పుడు తొలిముద్ద వేసిన గృహిణి దగ్గర్నించి తనకు సాయం చేసిన ప్రతి ఒక్కర్నీ పేరుపేరున గుర్తుంచుకున్న సౌశీల్యం ఆయనది.

వరికొయ్యల కాల్చివేతతో కాలుష్యం

పంటపొలాలకూ నష్టం వాటిల్లే ప్రమాదం
కాలుష్యంపై పర్యావరణవేత్తల ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో కాలుష్యం ఇప్పుడు సర్వత్రా చర్చనీయంశం అవుతున్న తరుణంలో తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయ వ్యర్థాలను కాల్చేయడం కాలష్యకారకంగా భావిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వరికొయ్యలను కాల్చడం అలవాటుచేసుకున్న కారణంగా మనకూ కాలుష్య ముప్పు రాబోతున్నదని పర్యావరణ వేత్తలు హెచ్చరి స్తున్నారు. పొలాల్లో వరి కొయ్యలను కాల్చేయడం కాలుష్యానికి ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు అంటున్నారు. కొయ్యలను నాగళ్లు లేదా ట్రాక్టర్లతో దున్నితే సరిపోతుందని అన్నారు. కానీ కాల్చడం వల్ల తీవ్రమైన పొగ కాలుష్యం ఏర్పడుతుందని అన్నారు. గతంలో వరిని కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతే కాకుండా అప్పటి రోజుల్లో పశువులు ఎక్కువగా, వరిసాగు తక్కువ ఉండడంతో వశుగ్రాసాన్ని కుప్పలు పెట్టుకునేవారు. కానీ, ప్రస్తుతం సాగు విధానాల్లో అనేక మార్పులు వచ్చాయి. యంత్రాలను విరివిగా వినియోగిస్తుండడంతో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొద్దో గొప్పో గడ్డిని తెచ్చుకోవడం, మిగిలిన దానిని అక్కడే వదిలివేస్తున్నారు. దీంతో దున్నేటప్పుడు నాగండ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు కాలబెడుతున్నారు. దీని వల్ల నష్టాలే తప్ప లాభం ఏమాత్రం ఉండదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. కర్షకుడికి తెలియకుండానే తీరని నష్టాన్ని మిగులుస్తుండగా, తగులబెట్టకుండా పొలంలో కలియదున్నితో ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ చెబుతున్నది. ప్రకృతిని నమ్ముకొని సేద్యం చేసే రైతన్న పర్యావరణానికి కీడు చేయడం ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. వరి కోతల తర్వాత కొయ్యకాలుకు నిప్పు పెట్టడం ఎన్నో అనర్థాలకు దారితీస్తున్నది. నేలకు సారాన్ని చేకూర్చే క్రిమికీటకాలు నశించిపోవడంతోపాటు వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. భూ సమతుల్యత దెబ్బతింటూ, మరో పంటపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఊలా మంది రైతులు వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడుకు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే తీసుకుంటున్నారు. దీని వల్ల కొయ్యకాలు, గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో కొయ్యకాళ్లను కాలబెట్టకుండా అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమయం తీసుకొని రెండో దఫా దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒకసారి రొటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి మళ్లీ దున్నినప్పుడు ఎలాంటి సమస్యా ఉండదు. దున్నే ముందు ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నితే భూమి సారవంతంగా మారుతుందని వ్యవసాయవేత్తలు సూచిస్తున్నారు. కొయ్యలు కాల్చడం వల్ల పొలాల్లో పాములు, ముంగిసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉన్నది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు అగ్నికి బుగ్గవుతుండడంతో పర్యావరణానికి తీరని హాని కలుగుతుందన్నారు. వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కార్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశమున్నదన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పేద్దపీట

మెదక్ , డిసెంబర్ 4: ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి సముచిత స్థానం కల్పిస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని ఎంపీపీ అతిథి గృహంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన చెక్కులను అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కల్యాణలక్ష్మి పథకం దేశానికే ఆదర్శమన్నారు. దేశంలో ఎవరు చేయని విధంగా రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. బీసీలకు కూడా త్వరలోనే అర్హులైన వారందరికీ సబ్సిడీ రుణాలను అందజేస్తామన్నారు.

సత్తా చాటిన ఎయిర్‌టెల్

అత్యధిక కస్టమర్లతో జీయోకు పోటీ

న్యూఢిల్లీ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ నెలలోనూ ఎయి÷–టెల్ తన సత్తా చాటుకున్నది. వరుసగా రెండో నెలలోనూ వినియోగదారులను ఆకట్టుకోగలిగింది. టెలికం రిగ్యులేటరీ సంస్థ ట్రాయ్ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం వొడాఫోన్ ఐడియా 4.6 మిలియన్ల మంది కష్టమర్లను కోల్పోయింది. సెప్టెంబర్‌లో 3.8 మిలియన్ల సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకున్నది. ఈ బాటలో రిలయన్స్ జియో 1.5 మిలియన్ల మంది వినియోగదారులను కొత్తగా సంపాదించింది. రిలయన్స్ జియోతో పోలిస్తే సెప్టెంబర్‌లో ఎయిర్‌టెల్ రెట్టింపునకు పైగా యూజర్లను ఆకట్టుకోగలిగింది. కొత్తగా కస్టమర్లను పొందడంలో వరుసగా రెండో నెలలోనూ జియోను మించిన స్పీడ్‌ను ఎయిర్‌టెల్ చూపింది. సెప్టెంబర్‌లో వైర్‌లైన్ విభాగంలో జియో 3,03,205 యూజర్లను, ఎయిర్‌టెల్ 66,335 వినియోగదారులనూ జత కలుపుకున్నాయి. దీంతో ఎయిర్‌టెల్ వైర్‌లైన్ వినియోగదారుల సంఖ్య 4.4 మిలియన్లను తాకగా.. రిలయన్స్ జియో వైర్‌లైన్ సబ్‌స్క్రైయిబర్లు 2.1 మిలియన్లకు చేరింది. కాగా.. దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రయిబర్ల సంఖ్య సెప్టెంబర్‌లో 1.4 శాతం వృద్ధితో 72.63 కోట్లకు చేరింది. ఈ విభాగంలో రిలయన్స్ జియో మార్కెట్ వాటా 55.9 శాతంకాగా.. 22.9 శాతంతో ఎయిర్‌టెల్ ద్వితీయ ర్యాంకులో నిలిచింది. వొడాఫోన్ ఐడియా మార్కెట్ వాటా 16.5 శాతంగా నమోదైంది. సెప్టెంబర్ చివరికల్లా రిలయన్స్ రిలయన్స్ జియో మొబైల్ వినియోగ దారుల సంఖ్య 0.36 శాతం పుంజుకుని 40.41 కోట్లను తాకింది. ఇక ఎయిర్‌టెల్ యూజర్ల సంఖ్య 1.17 శాతం వృద్ధితో 32.66 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియా 4.7 మిలియన్ల సబ్‌స్క్రైబర్లను కోల్పోవడం ద్వారా 29.55 కోట్ల సంఖ్యకు పరిమితమైంది. దీంతో 35.1 శాతం మార్కెట్ వాటాతో రిలయన్స్ జియో అగ్రస్థానంలో నిలవగా.. 28.4 శాతం వాటాతో ఎయిర్‌టెల్ రెండో ర్యాంకును పొందింది. వొడాఫోన్ ఐడియా 25.7 శాతం మార్కెట్ వాటాతో తదుపరి స్థానాన్ని కైవసం చేసుకుంది.

జీహెచ్ఎంసి ఫలితాలతో నిరుత్సాహ పడొద్దు

గెలుపోటములు కాంగ్రెస్‌కు సహజమే
కార్యకర్తలకు ధైర్యం చెప్పిన ఎంపి కోమటిరెడ్డి

నల్లగొండ,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఫలితాలు చూసి కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహపడొద్దని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు గెలుపు, ఓటములు సహజమేనని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రేటర్ అభివృద్ధి చెందిందని చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీఆర్ఎస్, బీజేపీ అధికార దుర్వినియోగం, కులమతాలకు కొట్లాట పెట్టి లబ్ధి పొందాలని చూస్తోందని మండిపడ్డారు. పీసీసీ మార్పును కేంద్ర నాయకత్వం చూసుకుంటుందని తెలిపారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ ఎన్నికలు తాత్కాలికమైనవేనని చెప్పారు. మరో రెండేళ్ల తర్వాత కాంగ్రెస్‌దే పాలన అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో రైతుల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తున్నానని అన్నారు. తెలంగాణలోనూ ఢిల్లీ మాదిరిగా ఉద్యమం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం సన్నరకం ధాన్యం పండించాలని చెప్పారని వాటిని ఇప్పుడు ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, ఫార్మాసిటీల పేరుతో దోపిడి. ఎస్ఎల్ బీసీ, బ్రహ్మణవెల్లం ప్రాజెక్టుల పూర్తి చేయాలని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల 9న ఆందోళనలు చేపడుతామని చెప్పారు. 57 ఏళ్ల ఫెన్షన్, నిరుద్యోగ భృతి ఏమైంది..? తండ్రికొడుకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ధరణి.. తలతోకలేని కార్యక్రమం అని దీంతో ఎలాంటి ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ప్రజలు నష్టపోతున్నారని విమర్శించారు.

రోడ్డు పనుల మంజూరుకు లంచం

ఎసిబికి చిక్కిన స్టాటిస్టికల్ అధికారి

ఆదిలాబాద్,డిసెంబర్4(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిగా పనిచేస్తున్న ప్రదీప్ కాంటాక్టర్ వద్ద నుంచి రూ .4,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టబడ్డాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంటకు చెందిన శరత్ అనే కాంట్రాక్టర్ గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను చేశాడు. రోడ్డు పనులకు సంబంధించిన బిల్లుల కోసం అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రదీప్ రూ.4 వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు కాంట్రాక్టర్ శరత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈరోజు ఉదయం పదకొండున్నర గంటలకు సమయంలో కాంట్రాక్టర్ నుంచి ప్రదీప్ రూ. 4వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ అధికారులు కార్యాలయంలో పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నారు.

మున్సిపాల్‌లో పనిచేసే ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిలకు జీతాలు వెంటనే ఇవ్వాలి: కౌన్సిలర్ సంగ హనువ్వ

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ లో పనిచేసే ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కార్మికులకు జీతాలు ఇవ్వాలని ఒకటవ వార్డు కౌన్సిలర్ సంగ హనువ్వ అన్నారు ఆమె మాట్లాడుతూ మున్సిపల్ లో పనిచేసే ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ లకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పడుతున్న తరుణంలో వెంటనే ఇవ్వాలని ఆమె కోరారు కరో నా కష్టకాలంలో ఎంతగానో శ్రమించిన మున్సిపల్ కార్మికులు కు ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా ఆపడం సరైనది కాదు అని ఆమె అన్నారు ఇప్పుడున్న పరిస్థితుల్లో కుటుంబం పూట గడవని పరిస్థితి ఉంది కాబట్టి కార్మికులకు వెంటనే జీతాలు ఇచ్చివాళ్లను ఆదుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ ను కోరడం జరిగిందని ఆమె అన్నారు వెంటనే జీతాలు మంజూరు చేయాలని హనువ్వ కోరారు.

నేరస్తులకు శిక్షలు పడటంలో కోర్ట్ డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర కీలకం

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి):నేరస్థులకు శిక్షలు పడటంలో కోర్టు డ్యూటీ పోలీసు అధికారుల పాత్ర కీలకమని కోర్టు డ్యూటీ వర్టికల్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయం లోని సమావేశ హాల్ నందు జిల్లా లోని పోలీస్ స్టేషన్ లలో కోర్టు డ్యూటీ నిర్వహించే పోలీస్ అధికారులతో కోర్ట్ డ్యూటీ వర్టికల్ మీద జిల్లా ఇంచార్జ్ ఎస్సీ సింధూ శర్మ ఆదేశాల మేరకు కోర్ట్ డ్యూటీ వర్టికల్ ఇంచార్జి సి.ఐ నవీన్ కుమార్ ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సి. ఐ మాట్లాడుతూ ఆయా కోర్టులలో నడుస్తున్న కేసులలో ఏ ఏ కేసు ఏ ఏ స్థాయిలో ట్రాయల్స్ నడుస్తుందో ఆయా కోర్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోర్ట్ డ్యూటీ విధులు నిర్వహించే అధికారులను ఉద్యేశించి మాట్లాడుతూ నేరానికి పాల్పడిన నేరస్థుడికి కనీసం ఆరునెల నుండి ఒక సంవత్సరం లోపైన శిక్షపడటం ద్వారా నేరస్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని. అందరు సంబంధిత నేరం గురించి మర్చిపోక ముందే నేరస్థుడికి శిక్షను విధించడం ద్వారా నేరస్థులకు నేరాలు చేయాంటే బయపడుతారని అన్నారు.అలాగే కోర్టు డ్యూటీ సిబ్బంది ట్రాయల్స్ మరియు పిటి కేసుల అప్డేట్ చేయుట గురించి, కేసుల ఆస్తి నమోదు రిజిస్టర్ నిర్వహణ, ప్రాపర్టీ ఇండెక్స్ నవీకరణ చేసుకోవాలని, సమ్మన్స్ సర్వ్ చేయుట గురించి , వారెంట్స్ అమలు పరుచుట గురించి, న్యాయ స్థానానికి సంబందించిన ముఖ్యమైన కార్యకలాపాలను అప్డేట్ చేయుట గురించి కోర్ట్ డ్యూటీ అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది.

పెట్టి కేసులను ఎప్పటుకప్పుడు అప్డేట్ చేయాలని, చార్జీ షీట్ వేయని కేసుల్లో త్వరగా చార్జీ షీట్ వేయాలని, కోర్ట్ కేసు విచారణలో నిందితుల హాజరైన వివరాలు నమోదు చేయాలని కేసులలో సాక్షులను ప్రవేశపెట్టేటప్పుడు వారికి పూర్తిగా బ్రీఫింగ్ చేయాలని, రోజు వారీ ప్రాసెస్ నిర్వహణ రిజిస్టర్ ను నవికరించుకోవాలని ,కోర్ట్ క్యాలెండర్ ను సిద్ధం చేసుకొని ఎస్ హెచ్ ఓ మరియు కోర్ట్ గదులలో ప్రదర్శింప చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సీసీ నెంబర్ లను పొందేటట్లు చూసుకోవాలని, సాక్షులు, ముద్దాయి లు కోర్ట్ కు హాజరయ్యేలా చూసుకోవాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమం లో డి.సి.ఆర్.బి సి.ఐ శ్రీలత ఐటీ సిబ్బంది, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల నుండి వచ్చిన కోర్ట్ డ్యూటీ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ పెంచలయ్యను సన్మానించిన దంత వైద్యులు.

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 4 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజలక